

● మాడవీధుల్లో ఊరేగిన ఉగ్రశ్రీనివాసమూర్తి

తిరుమల, నవంబరు2(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంలో ఆదివారం కైశిక ద్వాదశి ఆస్థానం వైభవంగా జరిగింది. వేకువజామున 4.30 నుంచి 5.45 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత ఉగ్రశ్రీనివాసమూర్తి ఆలయ మాడవీధుల్లో ఊరేగారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు బంగారు వాకిలి చెంత అర్చకులు పురాణ పఠనంతో కైశిక ద్వాదశి ఆస్థానాన్ని నిర్వహించారు. వేంకటతురైవార్, స్నపనబేరంగా పిలిచే ఉగ్రశ్రీనివాసమూర్తి ఒక్క కైశిక ద్వాదశి రోజు మాత్రమే సూర్యోదయానికి ముందు మాడవీధుల్లో ఊరేగుతారు. శ్రీవారి దర్శనార్థం వచ్చిన భక్తులు ఈ వాహనసేవలో పాల్గొన్నారు. భక్తులందరికీ స్వామి కృపాక టాక్షాలు కలగాలని ప్రార్థించినట్టు టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ చెప్పారు.

'హిమ' నగరం



తిరుపతి నగరాన్ని ఆదివారం పొగమంచు దట్టంగా కమ్మేసింది. ఉదయం 10గంటల వరకు మంచు సోయగం ఆహ్లాదపరిచింది. చలి పెరగడంతో వృద్ధులు, చంటి బిడ్డలు వణికిపోయారు. ఇక, మొదటి ఘాట్‌లో తిరుపతికి దిగే భక్తులు ప్రకృతి రమణీయ దృశ్యాలను వీక్షించారు. పదిగంటల తర్వాత పొగమంచు వీడిపోయి ఎండ చురుగ్గా వచ్చింది.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

హుషార్

ఎల్వీఎం3-ఎం5 రాకెట్ ప్రయోగ విజయంతో అంబరాన్నంటిన సంబరాలు



ఆదివారం సాయంత్రం 5.26 గంటలు. శనివారం సాయంత్రం మొదలైన కౌంట్ డౌన్ '0'కు చేరింది. అంతే.. ఒక్కసారిగా నిప్పులు చిమ్ముతూ భారీ ఉపగ్రహాన్ని తీసుకుని బాహుబలి రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. కోట్లాది మంది భారతీయుల కలలను సాకారం చేస్తూ.. శాస్త్రవేత్తల శ్రమకు ప్రతిఫలమిస్తూ సీఎంఎస్-03 ఉపగ్రహాన్ని కక్ష్యలోకి విజయవంతంగా చేర్చింది. దీంతో ఒక్కసారిగా షార్‌లో చప్పట్లతో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. దేశమంతా సంబరం చేసుకుంది. దీనికి సతీష్ థావన్ స్పేస్ సెంటర్ (షార్) వేదికైంది.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి ఆదివారం సాయంత్రం 5.26 గంటలకు ఎల్వీఎం3-ఎం5 రాకెట్.. 4,410 కిలోల అతి పెద్దదైన సీఎంఎస్-03 కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని మోసుకుంటూ రోదసిలోకి వెళ్లింది. మూడు దశలను విజయవంతంగా పర్తి చేసుకుని నిర్ణీత 16.29 నిమిషాల్లో ఉపగ్రహాన్ని కక్ష్యలోకి చేర్చింది. ఈ ప్రయోగం విజయవంతమైనట్లు మిషన్ కంట్రోల్ సెంటర్‌లో ఇస్రో ఛైర్మన్ నారాయణన్ ప్రకటించడంతో సంబరాలు మిన్నంటాయి.తొలి ప్రయత్నంలోనే భారీ ప్రయోగం విజయవంతం కావడంతో దేశమంతా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.ఈ ప్రయోగాన్ని వీక్షించేందుకు గ్యాలరీకి మధ్యాహ్నమే భారీగా సందర్శకులు చేరుకున్నారు. ఆదివారం కావడంతో సుదూర ప్రాంతాల నుంచి విద్యార్థులు అధికంగా విచ్చేశారు. రాకెట్ నింగిలోకి ఎగిరే సమయంలో గ్యాలరీలో ఉన్న వీక్షకులు చప్పట్లు, కేరింతలు కొడుతూ ఉత్సాహంతో తిలకించారు.


వీక్షిస్తున్న ఇస్రో చైర్మన్, శాస్త్రవేత్తలు


గ్యాలరీలో నుంచి తిలకిస్తున్న వీక్షకులు

ఎల్వీఎం3 వరుస విజయాలు..

బరువైన ఉపగ్రహాలను నింగిలోకి పంపేందుకు ఇస్రో శాస్త్రవేత్తలు ఎల్వీఎం3 రాకెట్లను రూపొందించారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో క్రయోజనిక్ దశను సైతం అభివృద్ధి చేసి విజయవంతంగా ప్రయోగించారు.

● 2010లో ఎల్వీఎం3 రాకెట్లకు పునాది వేయగా తొలిసారిగా 2014 డిసెంబరు 18న ఎల్వీఎం3 కేర్ మిషన్‌ను ప్రయోగించి తొలి ప్రయత్నంలో విజయం సాధించారు.అప్పటి నుంచి భారీ ఉపగ్రహాలను ఈ రాకెట్ ద్వారా పంపేందుకు శ్రీకారం చుట్టారు.

● 2017 జూన్ 5న ఎల్వీఎం3-డీ1 ద్వారా జీశాట్-19 ఉపగ్రహాన్ని విజయవంతం పంపారు. అప్పట్నుంచి భారీ ఉపగ్రహాలను విజయవంతంగా మోసుకెళ్లే ఈ రాకెట్.. బాహుబలిగా పేరొందింది.

● 2018 నవంబరు 14న జీశాట్-29, 2019 జూలై 22న ఎల్వీఎం3-ఎం1ద్వారా చంద్రయాన్-2, 20 22 అక్టోబరు 22 ఎల్వీఎం3-ఎం2 వన్‌వెబ్-1,2023 మార్చి 23ఎల్వీఎం3- ఎం3 ద్వారా వన్‌వెబ్-2, 2023 జూలై 14 ఎల్వీఎం3-ఎ4 ద్వారా చంద్రయాన్-3 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించి చరిత్ర సృష్టించారు.

● తాజాగా ఎనిమిదో ప్రయోగం ఎల్వీఎం3-ఎం5 రాకెట్ ద్వారా కమ్యూనికేషన్ రంగానికి చెందిన సీఎంఎస్-03 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించడంతో ఇస్రో చరిత్రలో మరో కలికితురాయిగా నిలిచింది. వరుసగా 8 ప్రయోగాలతో మన శాస్త్రవేత్తలు సత్తా చాటారు.

శ్రీకాళి ఆశీస్సుల కోసం..

వివాహానంతరం శ్రీవారి ఆశీస్సులు పొందడానికి సినీ హీరో నారా రోహిత్, శిరీష దంపతులు తిరుమలకు వచ్చారు. ఆదివారం ఉదయం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం వెలుపల రోహిత్ దంపతులను పలువురు అభిమానులు ఆసక్తిగా చూశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



● కార్తీక సోమవారం

నేడు శివాలయాలు, పుణ్య స్నానాలకు

పోటెత్తనున్న భక్తజనం

● ఆలయాలు, జలపాతాలు, బీచ్‌ల వద్ద భద్రత తప్పనిసరి

● భక్తులూ స్వీయనియంత్రణ పాటించాలి

తిరుపతి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం.. జిల్లావ్యాప్తంగా శివాలయాల సందర్శనకు, పుణ్య స్నానాల కోసం జలపాతాలకు, సముద్ర తీరానికి భక్తుల రాక పెరగనుంది. ఈ ఏడాది ప్రారంభంలో తిరుపతిలోనూ, గత శనివారం శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోనూ జరిగిన తొక్కిసలాట ఘటనల నేపథ్యంలో ఆలయాలు, జలపాతాలు, బీచ్‌ల వద్ద కట్టుదిట్టమైన భద్రత కల్పించాల్సిన అవసరం కనిపిస్తోంది. అదే సమయంలో భక్తులు కూడా స్వీయ జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. జిల్లాలో చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాశస్త్యం కలిగిన శివాలయాలు అనేకం వున్నాయి. శ్రీకాళహస్తికి దక్షిణ కాశిగా పేరు. ఏర్పేడు మండలం గుడిమల్లంలో క్రీస్తుపూర్వం నాటి పరశురామేశ్వరాలయం వుంది. నాగలాపురం మండలం సురుటిపల్లిలో పౌరాణి ప్రశస్తి కలిగిన పల్లికొండేశ్వరాలయ ఖ్యాతి తెలియంది కాదు. తిరుపతిలో కపిలేశ్వరస్వామి ఆలయం.. కపిలతీర్థం జలపాతం గురించి చెప్పాల్సిన పనిలేదు. శివాలయాలతో కూడిన జలపాతాలకు కొదువ లేదు. తలకోన సిద్ధేశ్వరస్వామి ఆలయం, ఝరిగా పేరొందిన జలపాతం తెలియని వారుండరు. కైలాసకోన, సదాశివకోన, మూలకోన వంటి చోట్ల శివాలయాలతో పాటు జలపాతాలున్నాయి. ఉబ్బలమడుగు, మామండూరు వంటి జలపాతాలతో పాటు తూపిలిపాలెం, శ్రీనివాసనత్రం వంటి బీచ్‌లు జిల్లాలో వున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జలపాతాలు ఉధ్రుతిగా ఉన్నాయి. స్వర్ణముఖితో పాటు పలు వాగులు, తెలుగు గంగ కాలువలు ఇప్పటికీ ఒకింత ప్రమాదకరంగానే ప్రవహిస్తున్నాయి. కార్తీక సోమవారం సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు ఈ ఆలయాలకు, జలపాతాలకు, బీచ్‌లకు వెళ్ళే అవకాశముంది. ఈ నేపథ్యంలో ఆయా పరిధిలోని రెవెన్యూ, పోలీసు అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని తగిన భద్రతా ఏర్పాట్లు చేపట్టాల్సిన అవసరముంది. భక్తులకూ అవగాహన కల్పించాలి.

ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందన

తడ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎల్‌వీఎం3-ఎం5 రాకెట్ ప్రయోగం విజయవంతానికి కృషి చేసిన ఇస్రో శాస్త్రవేత్తలను శ్రీసిటీ ఎండీ రవీంద్రసన్నారెడ్డి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ వేర్వేరు ప్రకటనల్లో అభినందించారు. ఇస్రో ఛైర్మన్ డాక్టర్ నారాయణన్, షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్, ఇతర శాస్త్రవేత్తలను అభినందిస్తున్నామని వారు పేర్కొన్నారు.


రాకెట్ ప్రయోగం నేపథ్యంలో షార్ మొదటి గేటు వద్ద పోలీసులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది బందోబస్తు

నిండుగా పులికాట్

పులికాట్ సరస్సు జలకళ సంతరించుకుంది ఇటీవల వర్షాలకు భారీగా వరదనీరు చేరింది. దీంతో సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే రోడ్డు మార్గంలో, వేనాడు, కొరిడి-పేర్నాడు మార్గాలో సరస్సు నిండుకుండను తలపిస్తోంది. ఆంధ్ర, తమిళనాడు ప్రాంతాల్లో 620 చదరపు కీలో మీటర్ల విస్తరించి ఉన్న పులికాట్‌లో ఇటు సముద్రం నుంచి ఉప్పునీరు, నదుల నుంచి మంచినీరు కలవడంతో అపార మత్స్య సంపదకు నిలయంగా పేరుగాంచింది. భారీగా నీరు చేరడంతో ఇక్కడ పక్షులు సందడి చేస్తున్నాయి.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి



సరస్సులో పక్షుల సందడి



నేడు డయల్ యువర్ ఎస్పీడీసీఎల్ సీఎండీ

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని విద్యుత్ సదరన్ డిస్కం కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ సీఎండీ శివ శంకర్ ఆదివారం తెలిపారు. వినియోగదారులు తమ సమస్యలను ఫోనుద్వారా తెలిపి పరిష్కరించుకోవడానికి ఇదో మంచి వేదికన్నారు. సోమవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు 89777 16661 నెంబరుకు ఫిర్యాదు చేస్తే తాను విని పరిష్కరించడానికి వీలవుతుందన్నారు. అలాగే 91333 31912 నెంబరుకు చాట్ చేసి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చని సూచించారు.


హలో.. నేను వేంకటేశ్వరుడ్ని

ముగిసిన బాలోత్సవం

మట్టితో విభిన్న ఆకృతులతో బొమ్మలను ఆవిష్కరించారు. అబ్బురపరిచే దృశ్యాలను గీశారు. దేశభక్తి పాటలు పాడారు. వివిధ అంశాలపై ఉపన్యాసాలిచ్చారు. కోలాటాలాడారు. నృత్య ప్రదర్శనలతో అలరించారు. చెవులక ఇంపుగా శాస్త్రీయ సంగీతం వినిపించారు. జానపద గీతాలతో హుషారెత్తించారు. యోగా విన్యాసాలతో అబ్బురపరిచారు. ఇలా రెండు రోజులపాటు తిరుపతిలో సాగిన బాలోత్సవం ఆదివారం ముగిసింది. రెండో రోజున 18 అంశాల్లో వివిధ పోటీలు నిర్వహించారు. ఇందులో ఆరు సాంస్కృతిక వేదికల్లో నృత్యప్రదర్శనలు, జానపద కళాప్రదర్శలు జరిగాయి. ఈ రెండు రోజులపాటు విద్యార్థులు సరదాగా గడిపారు. కొన్ని పాఠశాలల నుంచి విద్యార్థులు రాగా.. మరికొందరు తమ తల్లిదండ్రులతో కలిసి పోటీలను వీక్షిస్తూ ఆనందంగా గడిపారు.

- తిరుపతి(కల్చరల్), ఆంధ్రజ్యోతి





ఏర్పేడు నుంచి పూడికి రైలు మార్గం

● యుద్ధప్రాతిపదికన సర్వే పనులు

● మండలంలో 151.03 ఎకరాల సేకరణ

ఏర్పేడు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు రైల్వేస్టేషన్ నుంచి వడమాల పేట సమీపంలోని పూడికి రైలు మార్గం ఏర్పాటు కానుంది. ఇటు చెన్నైకి, అటు గుంతకల్లుకు వెళ్లడానికి రెండు మార్గాలను కలుపుతూ ఈ మార్గం ఏర్పాటు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణకు సిద్ధమైంది. వెంకటాపురం, ఇసుకతాగేలి, పాతవీరాపురం, మాధవమాల, కోబాక, ఎండీ పుత్తూరు, మునగలపాళెం, వెదళ్లచెరువు, చెల్లూరు, గుడిమల్లం గ్రామాల మీదుగా పూడికి రైలు మార్గం వేయనన్నారు. ఆయా గ్రామాల్లో తహసీల్దారు భార్గవి ఆధ్వర్యంలో 20 రోజులుగా సర్వే చేస్తున్నారు. రైలు మార్గానికి భూములు కోల్పోతున్న రైతులతో త్వరలో సమావేశం కానున్నారు. కాగా, సర్వే రిపోర్టు ప్రకారం రైతులకు పరిహారం అందించేందుకు వీలుగా సబ్ రిజిస్ట్రార్‌కు వాల్యూ వేయాలని తహసీల్దార్ ప్రతిపాదనలు పంపారు. ఇసుక తాగేలిలో 22.45ఎకరాలు, పాతవీరాపురంలో 19.37, మాధవమాలలో 2.79, మునగలపాళెంలో 4.43, కోబాకలో 7.49, ఎండీపుత్తూరులో 20.69, చెల్లూరులో 35.84, వెదళ్ల చెరువులో 12.64, గుడిమల్లంలో 24.92 ఎకరాల చొప్పున ఈ రైలు మార్గానికి అవసరం కానుంది.



రామ్మూర్తినాయుడి ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తున్న నారా రోహిత్ దంపతులు

నారావారిపల్లెకు రోహిత్ దంపతులు

చంద్రగిరి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): దివంగత నారా రామ్మూర్తినాయుడి కుమారుడు రోహిత్, శిరీష దంపతులు స్వగ్రామమైన చంద్రగిరి మండలం నారావారిపల్లెకు ఆదివారం విచ్చేశారు. తల్లి ఇందిరతో పాటు గ్రామస్తులు, బంధువులతో కలిసి రోహిత్, ఆయన సతీమణి శిరీష నాగాలమ్మ, గ్రామ దేవత దొడ్డి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామ్మూర్తినాయుడు, తాత, అవ్వలు ఖర్జురపునాయుడు, అమ్మణ్ణమ్మ సమాధులకు.. అనంతరం గ్రామంలోని ఎన్టీఆర్, బసవతారకం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అతకుముందు శాప్ చైర్మన్ రవినాయుడు ఆధ్వర్యంలో రోహిత్ దంపతులకు స్వాగతం పలికారు. తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్ మహేష్‌యాదవ్ వీరికి శాలువా కప్పి జ్ఞాపిక మోమెంటో అందజేశారు.

భక్తజన సంద్రం... ముక్కంటి ఆలయం

శ్రీకాళహస్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సెలవులకుతోడు కార్తీకమాసం కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 30 వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.



శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5గంటల వరకు ఉన్న సమాచారం మేరకు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 8 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శుక్రవారం హుండీ ఆదాయం: రూ.2.98 కోట్లు

శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 72,860

తలనీలాలు సమర్పించినవారు: 31,612



మంచి పౌరుల కొరత తీర్చడమే

బాలోత్సవం లక్ష్యం









విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అతిథులు - బొమ్మలు గీస్తున్న విద్యార్థి

తిరుపతి(కల్చరల్), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): 'మన దేశంలో మంచి పౌరుల కొరత వెంటాడుతోంది. దీనిని తీర్చడానికి బాలోత్సవం ఎంతగానో ఉపకరిస్తుంది' అని పలువురు అభిప్రాయపడ్డారు. తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాలలో రెండు రోజులపాటు జరిగిన బాలోత్సవం ఆదివారం ముగిసింది. ఈ సమావేశంలో ప్రముఖ సాహితీవేత్త సాకం నాగరాజు, గార్లపాటి దామోదరం, బీఎన్ రెడ్డి, మణికంఠ, మబ్బు సూర్యనారాయణరెడ్డి, కేవీచౌదరి, ఏనుగుల అంకమనాయుడు, అనంతశయనం, హేమచంద్ర తదితరులు ప్రసంగించారు. ఈ సారి బాలోత్సవంలో 11వేల మందికిపైగా బాలబాలికలు పాల్గొన్నారన్నారు. వివిధ అంశాల్లో జరిగిన పోటీలలో విద్యార్థులు తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించారని చెప్పారు. నిత్యం చదువుల ఒత్తిడిలో ఉండే పిల్లలకు ఈ బాలోత్సవం ఆటవిడుపుగా పేర్కొన్నారు. తమ ప్రతిభతో తొలిమూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో టెంకాయల దామోదరం, నడ్డి నారాయణ, రెడ్డెప్ప, గురునాథం, మునిలక్ష్మి, మన్నవ గంగాధర ప్రసాద్, నెమిలేటి కిట్టన్న, ప్రసాద్, యువశ్రీ మురళి, పేరూరు బాలసుబ్రమణ్యం, గోవిందయ్య, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.



అలరించిన కోలాటం









అలరించిన నృత్య ప్రదర్శన



నృత్యం చేస్తున్న కళాకారులు

తిరుచానూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి-తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శన అలరించింది. చెన్నైకు చెందిన ఆరుద్ర నృత్య అకాడమీకి చెందిన కళాకారులు తనీష్, జానవిరెడ్డి, దీక్షిత, గమ్యశ్రీ, సురేఖ, అర్పిత, భానుశ్రీ, ధనుశ్రీ, తన్మయి తదితరులు పుష్పాంజలి, కీర్తనై, కృష్ణలీల, తిల్లాన వంటి కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. ఏవో సుధాకర్, ఏఈ రాధాకృష్ణ వారిని అభినందించి, సర్టిఫికెట్లు అందజేశారు.

అమ్మవారి సేవలో మహారాష్ట్ర మంత్రి



ఆలయం వద్ద మహారాష్ట్ర మంత్రి గిరీష్ మహాజన్

తిరుచానూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర జలవనరులు, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి గిరీష్ మహాజన్ ఆదివారం కుటుంబ సమేతంగా తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద అధికారులు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ధ్వజస్తంబానికి నమస్కరించి, అనంతరం సన్నిధిలోని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు వారిని అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

వైభవంగా ధ్వజారోహణం



మూషిక వాహనంపై దర్శనమిస్తున్న వినాయకస్వామి

చంద్రగిరి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండవాడ స్వర్ణముఖి నది ఒడ్డున వెలసిన శ్రీఅగస్త్యేశ్వరస్వామి ఆలయంలో రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలకు ఆదివారం ధ్వజారోహణం చేశారు. ఉదయం 7.30 నుంచి 9 గంటల వరకు కలశస్థాపన, మండపారాధన, గణపతి హోమం అనంతరం ధ్వజారోహణం నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమం చేపట్టారు. రాత్రి 7 గంటలకు వినాయకస్వామి ఉత్సవమూర్తిని అలంకరించి, మూషిక వాహనంపై మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

బాలోత్సవంలో కళ్యాణీ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

చంద్రగిరి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జరిగిన 4వ బాలోత్సవంలో చంద్రగిరిలోని కళ్యాణీ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని కరస్పాండెంట్ అయ్యప్పన్ తెలిపారు. పత్రికా పఠనంలో వి.గిరిజ(6వ తరగతి) రెండవ, వి.గాయత్రి(6వ తరగతి) మూడవ స్థానం, తెలుగు పదకేళిలో ఎస్.గేశ్వంత్(9వ తరగతి) ప్రథమ స్థానం, మట్టితో బొమ్మల తయారీలో కె.తిషిత(5వ తరగతి) రెండు, మూడవ స్థానంలో నిలిచారని వెల్లడించారు. వారిని కరస్పాండెంట్ అయ్యప్పన్, ఉపాధ్యాయులు అభినందించారు.



దేవరకొండ తూముకుంట చెరువుకు గండి





చెరువుకు పడిన గండిని పూడ్చుతున్న అధికారులు

తూముకుంట చెరువుకు పడిన గండి

భాకరాపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలం దేవరకొండ పంచాయతీ వంగిమళ్లవారిపల్లె సమీపంలోని తూముకుంట చెరువుకు శనివారం రాత్రి గండి పడింది. నీరు వృథాగా పోతుండటం ఆయుకట్టుదారులు, స్థానికులు గమనించి ఇరిగేషన్ అధికారులు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన గండి పూడ్చమని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఇసుక బస్తాలు, మట్టితో గండిని పూడ్చివేశారు. నీరు లీకేజీ కాకుండా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ సురేశ్, ఏఈ గిరీశ్, టీడీపీ నేతలు కృష్ణమూర్తి, మదనమోహన్, మల్లికార్జున రెడ్డి, మోహన్, రామ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సమాధుల పండుగ

పాకాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆల్‌సోల్స్ డే (సకల ఆత్మల పండుగ)ను పురస్కరించుకుని ఆదివారం స్థానిక క్రైస్తవుల సమాధుల తోటలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తమ కుటుంబాలలో మరణించిన వ్యక్తుల ఆత్మ శాంతికోసం, వాళ్లకు దైవానుగ్రహం లభించి పరలోకం చేరుకోవాలని కోరుకున్నారు. సమాధులను శుభ్రం చేసి రంగులు వేసి పుష్పాలు, పూలమాలతో అలంకరించి కొవ్వొత్తులు వెలిగించి, మతపెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఎస్ఐ పాస్టర్ రెవరెండ్ ప్రేమ్ కుమార్, ఆర్‌సీఎం చర్చి ఫాదర్ ఆంథోనిరాజ్ పాల్గొన్నారు.



సమాధుల తోటలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



క్రికెట్ మ్యాచ్ వీక్షించడానికి స్ర్కీన్‌ల ఏర్పాటు

చంద్రగిరి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): భారత్, సౌత్ ఆఫ్రికా జట్ల మధ్య జరుగుతున్న మహిళా క్రికెట్ వరల్డ్ కప్ మ్యాచ్‌ను ప్రజలు వీక్షించడానికి ఎమ్మెల్యే పులివర్తి నాని చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద ఎల్‌ఈడీ స్ర్కీన్లు ఏర్పాటు చేయించారు. చంద్రగిరి, పరిసర ప్రాంతాల నుంచి క్రికెట్ అభిమానులు మ్యాచ్‌ను తిలకించారు. భారత్ జట్టు విజయకేతనం ఎగురవేయాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్ర్కీన్

సత్యనారాయణపురం రోడ్డులో

ఆకతాయిల ఆగడాలు

● ఇద్దరికి గాయాలు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో కొన్నిచోట్ల మద్యం మత్తులో ఆకతాయిల ఆగడాలకు అంతు లేకుండా పోతోంది. ఇలా ఆదివాకం మంగళం రోడ్డు నుంచి సత్యనారాయణపురం వెళ్లే సర్కిల్ వద్ద నలుగురు మందుబాబులు ఆగడం చేశారు. రోడ్డుపైనే మద్యం బాటిళ్లు చేతపట్టుకుని తాగుతూ... ఆ దారిన వెళ్లే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారు. ద్వంద్వర్థాల మాటలతో దురుసుగా వ్యవహరించారు. వీరిని ప్రశ్నించిన ఇద్దరిపై కత్తితో దాడి చేశారు. ఆ నలుగురూ 20 నుంచి 25 ఏళ్ల వయసున్న వారే. వీరు జీవకోన, మంగళం వారుగా భావిస్తున్నారు. ఇలాంటి ఘటనలు మంగళం రోడ్డులోని అమెరికన్ బార్, ఆర్టీవో కార్యాలయం సమీపంలోని మరో బార్ వద్ద నిత్యకృత్యంగా మారాయి. వీరి విషయంలో పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎస్పీ ఆదేశాల మేరకు ప్రతి రోజూ సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలి. ఇవి కొన్ని సర్కిళ్ల పరిధిలో తూతూ మంత్రంగా జరగడంతో మందుబాబులు, ఆకతాయిల ఆగడాలకు అడ్డే లేకుండా పోయిందని స్థానికులు అంటున్నారు. రాత్రి 8 గంటల నుంచి బార్లు, మద్యం దుకాణాల వద్ద ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. ఇకనైనా పోలీసులు పటిష్ఠ గస్తీ నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

ర్యాపిడో డ్రైవర్ అసభ్యకర ప్రవర్తన

● అరెస్టు చేసిన పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం ఆటోనగర్ సమీపంలో నివాసమున్న ఓ బ్యూటీషియన్ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ర్యాపిడో డ్రైవర్ జైలుపాలయ్యాడు. అలిపిరి ఎస్ఐ లోకేష్‌బాబు తెలిపిన ప్రకారం.. ఆటోనగర్ సమీపంలో నివసిస్తున్న ఓ మహిళ ఇంటి వద్ద బ్యూటీషియన్ మాల్ నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి తిరుపతికి వచ్చిన ఆమె.. ఇంటికి వెళ్లడానికి ర్యాపిడో బుక్ చేసుకున్నారు. దీంతో ర్యాపిడో డ్రైవర్ పెద్దయ్య తిరుపతి నుంచి ఆమెను తీసుకుని ఇంటి వద్ద విడిచి పెట్టాడు. కొంతదూరం వెనక్కి వెళ్లిన తర్వాత ఆమె ర్యాపిడో బుక్ చేసిన నెంబరుకు ఫోనుచేసి అసభ్యంగా మాట్లాడాడు. మెసేజ్‌లు పెట్టాడు. వీడియో కాల్ చేయగా ఆమె తీయలేదు. ఆ తర్వాత ఇంటికెళ్లి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆమె కేకలు వేయడంతో ఇంట్లో ఉన్న భర్త, పిల్లలు వచ్చి అతడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. డయల్ 112కు సమాచారం ఇచ్చారు. అలిపిరి సీఐ రాంకిషోర్, ఎస్ఐ లోకేష్ బాబు, సిబ్బంది ర్యాపిడో డ్రైవర్ పెద్దయ్యను అరెస్టు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

చెత్త కుప్పలో 108 వాహనం



తిరుపతి (ఆటోనగర్), నవంబరు2 (ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయాల్లో ప్రజలకు సేవలు అందించాల్సిన 108 వాహనం తిరుపతి ప్రకాశం మున్సిపల్ పార్కు దక్షిణం వైపు చెత్తకుప్పలో ఉండటం చర్చనీయాంశంగా మారింది. అవసరమైతే మరమ్మతులు చేసి, వినియోగంలోకి తేవాలని, లేకపోతే తుక్కుగా విక్రయించి సొమ్ము చేయాలే తప్పా ఇలా నిరుపయోగంగా వదిలేయడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు ఒక ప్రకటనలో కోరారు. వాటి స్థానంలో కొత్తవి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

భారత జట్టు విజయం సాధించాలని పూజలు



కావలివారిపల్లెలో పూజలు చేస్తున్న మహిళలు

పాకాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ కప్ ఫైనల్స్‌లో భారత మహిళా క్రికెట్ జట్టు విజయం సాధించాలని మండలంలోని కావలివారిపల్లెలో మహిళలు ఆదివారం పూజలు నిర్వహించారు. టీడీపీ చంద్రగిరి నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు, సింగిల్ విండో చైర్‌పర్సన్ కె.సావిత్రి, వార్డు సభ్యురాలు విజయ, లక్ష్మీదేవి ఆధ్వర్యంలో వినాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. భారత జట్టు విజయం సాధించి విశ్వవిజేతగా నిలివాలని కాంక్షించారు.

చంద్రగిరిపై డ్రోన్ నిఘా



డ్రోన్ కెమెరాలో పర్యవేక్షిస్తున్న సీఐ సురేష్‌కుమార్

చంద్రగిరి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో అసాంఘిక కార్యకలాపాల నివారణకు డ్రోన్ కెమెరాతో నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ సురేష్‌కుమార్ వెల్లడించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగినా, పేకాట ఆడినా, ఇతర అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా డ్రోన్ కెమెరాలో రికార్డు అవుతుందని, తద్వారా వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రవీంద్రనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంగీత పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రముఖులు

రామచంద్రాపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకట్రామాపురం గ్రామంలో ఉన్న సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాలలో ఆదివారం భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత, నృత్య, పాటల పోటీలు ఆకట్టుకున్నాయి. జాతీయ గ్రూప్ సాంగ్ పోటీ - దక్షిణ ప్రాంత స్థాయి పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. భారత వికాస్ పరిషత్ జాతీయ కార్యదర్శి డి.శర్మ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వివిధ రాష్ట్రాల నుంచి అనేకమంది సంగీత కళాకారులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరచిన కళాకారులకు ముఖ్య అతిథులు ఎస్వీ వేద విశ్వవిద్యాలయం వీసీ రాణి సదాశివమూర్తి, వెంకటేశ్వర ఆయుర్వేద మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రేణు దీక్షిత్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ప్రాంత ప్రెసిడెంట్ ఎం.నిరంజన్‌బాబు, అవిలాల ప్రాంత కార్యదర్శి శ్రీధర్ పిళ్లై, ఫైనాన్స్ సెక్రటరీ సుంకు వేణుగోపాల్, ప్రతినిధులు పాల్గొన్నారు.

తుమ్మలగుంట ఎస్సీకాలనీలో స్థల వివాదం

తిరుపతిరూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట పంచాయతీ ఎస్సీ కాలనీ(అరుంధతివాడ)లోని ఓ స్థలానికి సంబంధించి ఆదివారం సాయంత్రం ఇరువర్గాల మధ్య వివాదం చోటుచేసుకుంది. మాతమ్మ తిరునాళ్లు జరుపుకునే స్థలాన్ని కొందరు జేసీబీ సాయంతో చదును చేస్తున్నారన్న సమాచారంతో స్థానికులు చేరుకోవడంతో ఈ వివాదం నెలకొంది. కాలనీ ప్రజలు మాట్లాడుతూ.. ఎన్నో సంవత్సరాలుగా ఆ స్థలంలో మాతమ్మ తిరునాళ్లు నిర్వహిస్తున్నామని, అమ్మవారిని పూజించే శూలాలు కూడా గుర్తుగా ఉన్నాయని అంటున్నారు. అమ్మవారి శూలాల్ని తొలగించి మరీ చదును పనులు చేపట్టడం దారుణమని వాపోతున్నారు. కాగా అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆ భూమిని తమకు విక్రయించారని, దీనికి సంబంధించిన అన్ని పత్రాలు తమ వద్ద ఉన్నాయని కొనుగోలుదారులు అంటున్నారు. కొనుగోలు చేసిన భూమిలో చదును పనులు చేపడుతుంటే గ్రామానికి చెందిన భూమి అని అడ్డుకోవడం సరికాదని అంటున్నారు. పనులను అడ్డుకోవడంతో విక్రయదారులు వెనుదిరిగారు.





చదును చేసిన స్థలంలో బయట పడ్డ శూలాలు - జేసీబీ సాయంతో తొలగిస్తున్న మొక్కలు

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గం

- మాజీ రాజ్యసభ సభ్యులు తులసిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయడం దుర్మార్గమని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యుడు తులసిరెడ్డి అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 17 నూతన మెడికల్ కళాశాలలు నిర్మించగా అందులో పది పీపీపీ విధానంలో ప్రైవేటీకరణ చేయడం బాధాకరమన్నారు. కేవలం రూ.6వేల కోట్లు ఖర్చు చేస్తే కళాశాలలన్నీ వినియోగంలోకి వస్తాయన్నారు. వాటిని ప్రైవేటుకు అప్పగిస్తే పేద విద్యార్థులకు వైద్యవిద్య అందని ద్రాక్షగా మారుతుందన్నారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు బాలగురవం బాబు, పీసీసీ ఉపాధ్యక్షులు దొడ్డారెడ్డి రాంభూపాల్‌రెడ్డి, శ్రీకాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి, నాయకులు లోకేష్‌రెడ్డి, జ్యోతీశ్వర్‌నాయక్, శివబాలాజీ, శబరి రాజన్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

5న జ్వాలాతోరణం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి(కల్చరల్), నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : ఈనెల 5వ తేదీన కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని స్థానిక కోదండరామస్వామి ఆలయ దక్షిణ మాడవీధిలోని చిగోర ఆధ్యాత్మిక కేంద్రంలో జ్వాలాతోరణం కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆధ్యాత్మిక కేంద్రం వ్యవస్థాపకుడు చిత్రపు హనుమంతరావు మాట్లాడుతూ సాయంత్రం 5 గంటలకు జ్వాలాతోరణం, తర్వాత అఖండ దీపారాధన, సహస్ర దీపాలంకరణ, రమా సహిత సత్యనారాయణ వ్రతం, పంచ హారతి ఉంటుందని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. జయలక్ష్మి, రంగనాథన్, లీలావతి, శేషగిరిరావు, సుబ్రహ్మణ్యంరెడ్డి పాల్గొన్నారు.

మఠం పునర్నిర్మాణ నిర్ణయం హర్షణీయం



సమావేశంలో మాట్లాడుతున్న నరసింహాచారి

తిరుపతి(ఎంఆర్‌పల్లె), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): హథీరాం బావాజీ మఠం భవనాన్ని పునర్నిర్మాణం చేస్తామని, ఆధ్యాత్మిక సంపదను కాపాడతామని కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రకటించడంపై 25వ డివిజన్ కార్పొరేటర్ నరసింహాచారి హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తమ డివిజన్‌లో ఉన్న పురాతనమైన సంపదను కాపాడాలని ఎన్నో పోరాటాలు చేశామన్నారు. మఠం భవనాన్ని అనుకుని ఉన్న దుకాణదారులకు ఎలాంటి నష్టమూ లేకుండా చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. 90శాతం మంది వ్యాపారులు నిజాయితీగా వ్యాపారం చేసుకుంటున్నారని, పదిశాతం మంది రాజకీయ పలుకుబడితో అద్దె చెల్లించడం లేదని అన్నారు. వారిపై మఠం అధికారులు చర్యలు తీసుకుంటే మద్దతుగా నిలుస్తామన్నారు.

స్పార్క్ ఆఫ్ ది ఇయర్‌గా సంజయ్ ఆచారి

● ఎమరాల్డ్స్ కాన్‌ఫ్లుయన్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



సంజయ్ ఆచారిని అభినందిస్తున్న ఎమరాల్డ్స్ డైరెక్టర్ గిరిధర్‌రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ మునిరత్నం

తిరుపతి (విద్య), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన 'కాన్‌ఫ్లుయన్స్'లో స్పార్క్ ఆఫ్ ది ఇయర్‌గా సంజయ్ ఆచారి నిలిచారు. పలువురు విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ఎమరాల్డ్స్ డైరెక్టర్లు విశ్వనాథ్, గిరిధర్ ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఆంగ్లభాష సామర్థ్యాన్ని పెంపొందించి ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు ఉపకరించేలా కాన్‌ఫ్లుయన్స్ పోటీలను రూపొందించినట్టు చెప్పారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో విద్యాసంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ మునిరత్నం, జానకిరామ్, శ్రీనివాసులు, నాథముని, ప్రిన్సిపాల్ జాఫర్, అధ్యాపకురాలు వసుంధర, భానుశ్రీ, రమేష్, భానుకిరణ్ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ చర్యలు భేష్

తిరుపతి(జీవకోన), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గరుడ వారధి ఫ్లైఓవర్‌పై ప్రమాదాల నివారణకు అధికారులు తీసుకున్న చర్యలు బాగున్నాయని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. మలుపుల వద్ద సూచిక బోర్డులు, స్పీడ్ నియంత్రణ చర్యలు, రాత్రిపూట వాహనదారులకు రోడ్డు స్పష్టంగా కనిపించేలా రేడియం స్టిక్కర్లు, బ్లింకింగ్ లైట్స్, మలుపుల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయడం బాగుందని తెలిపారు. అధికారుల నిర్ణయాలను పాటించి ప్రమాదాలు, ప్రాణనష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు.

రోహిత్ దంపతులకు గంగమ్మ ప్రసాదం



నారావారిపల్లెకు వచ్చిన నారా రోహిత్ దంపతులకు శాప్ చైర్మన్ రవినాయుడు, గంగమ్మ ఆలయ చైర్మన్ మహేష్ యాదవ్ గంగమ్మ ప్రసాదాలు, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు కొట్టే హేమంత్ రాయల్, తెలుగు యువత నాయకులు రంజిత్ కుమార్, ప్రకాష్, మధు, లోకేష్ వారి వెంట ఉన్నారు. -తిరుపతి, (ఆంధ్రజ్యోతి)

దుస్తుల దుకాణంలో చోరీ

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రముఖ బట్టల దుకాణంలో చోరీ జరిగింది. ఈస్ట్ ఎస్ఐ హేమాద్రి వివరాల మేరకు.. నిమ్మకాయల వీధిలోని శ్రీలక్ష్మీశ్రీనివాస హోల్‌సేల్ శారీ షాపు యజమాని శనివారం రాత్రి 9 గంటలకు దుకాణం మూసుకుని ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు దుకాణం షట్టర్ తాళాలు పగులకొట్టి లోపలికి ప్రవేశించారు. గల్లా పెట్టెలో ఉంచిన రూ.40వేలు తీసుకుని వెళ్లారు. షాపు ఎదురుగా బట్టలు ఐరన్ చేసుకునే మంగమ్మ ఆదివారం ఉదయం షాపు తెరిచి ఉండటం గమనించి దుకాణం యజమాని కుమారుడు ఉదయ్‌కుమార్‌కు సమాచారం ఇచ్చింది. షాపు వద్దకు వచ్చి పరిశీలించగా నగదు చోరీకి గురైనట్లు గుర్తించి, ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేశారు.

చక్రపాణికి జాతీయ పురస్కారం



తిరుపతి(ఆటోనగర్), నవంబరు2 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలానికి చెందిన రవాణా శాఖ విశ్రాంత ఉద్యోగి నందిపాటి చక్రపాణి ఆదివారం భానుమతి జాతీయ పురస్కారం అందుకున్నారు. చిత్తూరు కొంగారెడ్డిపల్లిలోని బ్రెయిన్ బాక్స్ అకాడమీలో ఎంవీ కేశవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ పురస్కారం ప్రదానం చేశారు. భారతీయ తెలుగు రచయితల సమాఖ్య అధ్యక్షుడు సి.నారాయణస్వామి, సాహితీవేత్త మల్లిపూడి దేవేంద్రరావు చేతుల మీదుగా అవార్డులు ప్రదానం చేసినట్లు సంస్థ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

భారీ స్క్రీన్‌లతో క్రికెట్ మ్యాచ్ ప్రసారం



ఏర్పాటు చేసిన స్క్రీన్

తిరుపతి(క్రీడలు), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మహిళా క్రికెట్ ప్రపంచకప్ ఫైనల్స్ వీక్షించడానికి స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలో శాప్ ఆధ్వర్యంలో, ఏసీఏ ఆధ్వర్యంలో స్థానిక కచ్చపి ఆడిటోరియంలో భారీ స్క్రీన్స్ ఏర్పాటు చేశారు. రెండు వేదికలలో రాజకీయ నేతలు, విద్యార్థులు, క్రీడాకారులు, సంఘాల ప్రతినిధులు హాజరై వీక్షించారు. ఇండియా బ్యాటర్లు ఫోర్లు, సిక్సర్లు బాదుతున్న సమయంలో కేరింతలు కొట్టారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, శాప్ చైర్మన్ రవినాయుడు, ఆర్సీ మునికృష్ణ, బ్యాంకు శాంతమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

మంగళం పీహెచ్‌సీలో మందుల కొరత

● అవస్థలు పడుతున్న ప్రజలు



మంగళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

తిరుపతి అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని మంగళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందుల కొరత తీవ్రంగా ఉంది. సప్తగిరికాలనీ, రణధీరపురం, మంగళం క్వార్టర్స్, తిరుమలనగర్, న్యూమంగళం పంచాయతీల ప్రజలు ఈ కేంద్రంలో చికిత్స పొందుతుంటారు. సేవలు బాగా ఉండటంతో శెట్టిపల్లి, కరకంబాడి, తిమ్మనాయుడుపాళెం గ్రామాలు, లీలామహల్ వరకు ప్రజలు ఈ ఆస్పత్రిని ఆశ్రయిస్తున్నారు. రోజుకు వందకు పైగా ఓపీలు వస్తున్నాయి. ఈ ఆస్పత్రిలో మందుల కొరత ఏర్పడింది. మూడు నెలలుగా అటీన్ 50ఎంజీ, అమ్లాడిఫిన్ 5ఎంజీ, బీకాంప్లెక్స్, పారాసెట్మాల్ 500ఎంజీ మాత్రలు అందుబాటులో లేవు. బయట తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. పట్టుబడితే ప్రత్యామ్నాయ మందులను ఇస్తున్నారు. ఇవి వాడితే రియాక్షన్స్ వస్తున్నట్లు కొంతమంది బాధితులు వాపోతున్నారు. జిల్లా ఆస్పత్రి స్టోర్ నుంచే మందులు సరఫరా కావడం లేదని చెప్పినా ప్రజలు వినిపించుకోవడం లేదని వైద్యులు వాపోతున్నారు. జిల్లా వైద్యవిభాగం స్పందించి మందులు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

వర్షమొస్తే జలమయం

కరకంబాడి రోడ్డులో పూర్తి స్థాయిలో లేని కాలువలు



భూపాల్ హౌసింగ్ కాలనీలో కాలువ



కరకంబాడీ రోడ్డులో కాలువ

తిరుపతి(జీవకోన), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి కరకంబాడీ రోడ్డులో కాలువలు పూర్తిస్థాయిలో లేకపోవడంతో చిన్నపాటి వర్షం వచ్చినా రోడ్లన్నీ జలమయమవుతున్నాయి. కార్పొరేషన్ పరిధి కరకంబాడీ రోడ్డులోని వెంకటేశ్వరకాలనీ వరకు విస్తరించి ఉంది. అయితే వరద నీటి కాలువలను తిమ్మినాయుడుపాళెం వరకు మాత్రమే నిర్మించారు. దీంతో భూపాల్ హౌసింగ్ కాలనీ పైభాగాన ఉన్న కొండ ప్రాంతాల నుంచి జాలువారే వరదనీరు రోడ్లపైకి చేరుతోంది. చిన్నపాటి వర్షం కురిసినా భూపాల్ హౌసింగ్ కాలనీ ముందు ఉన్న ప్రధాన రోడ్డు పూర్తి జలమయంగా మారుతోంది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. అధికారులు స్పందించి తిమ్మినాయుడుపాళెం దళితవాడ నుంచి కార్పొరేషన్ పరిధి వెంకటేశ్వర కాలనీ వరకు ప్రధాన రోడ్డులో వరద నీటి కాలువలను నిర్మించాల్సి ఉంది.

నేటి నుంచి శిల్పారామంలో గాంధీ శిల్ప్ బజార్

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి-తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో సోమవారం నుంచి 9వ తేదీ వరకు గాంధీశిల్ప్ బజార్ నిర్వహించనున్నట్లు కళాసృష్టి సంస్థ నిర్వాహకులు డాక్టర్ గుమ్మడిపూడి దశరథాచారి తెలిపారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తమ కళాసృష్టి సంస్థ కళాకారుల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు హస్తకళలను ప్రోత్సహిస్తోందన్నారు. హస్తకళల అభివృద్ధి కమిషనర్ కార్యాలయం చేయూతతో దేశవ్యాప్తంగా గాంధీ శిల్ప్ బజార్‌లను నిర్వహిస్తోందని, అందులో భాగంగా తిరుచానూరు రోడ్డులోని శిల్పా రామంలో ఏర్పాటు చేశామని తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 40మంది మాస్టర్ క్రాఫ్ట్ పర్సన్స్, అవార్డు గ్రహీతలు తమ వస్తువులను ప్రదర్శిస్తారని వివరించారు. ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ ప్రదర్శనలు ఉంటాయని, నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వైసీపీ వ్యతిరేకం

తిరుపతి(జీవకోన), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వైసీపీ వ్యతిరేకమని ఆ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు తలారి రాజేంద్ర అన్నారు. ఆదివారం వైసీపీ జిల్లా కార్యాలయం వద్ద మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎస్సీ విభాగం నాయకులు కృష్ణయ్య, నల్లాని బాబు, చింతా రాజేంద్ర, కల్లూరి చెంగయ్య, ఆంజనేయులు, అజయ్ కుమార్, మురళి, వంశీ, మిథున్, నారాయణరాజ్, చిన్న, తేజస్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

మహిళా క్రికెట్ జట్టు ప్రపంచ కప్ సాధించాలని కోరుకున్నా..

తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న దివాకర్‌రెడ్డి

తిరుమల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): భారత మహిళా క్రికెట్ జట్టు దక్షిణాఫ్రికా జట్టుపై గెలిచి ప్రపంచ కప్ సాధించాలని శ్రీవారిని కోరుకున్నట్లు తుడా చైర్మన్, టీటీడీ ఎక్స్‌అఫిషియో సభ్యుడు దివాకర్‌రెడ్డి తెలిపారు. ఏపీ క్రికెట్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సానా సతీష్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విజయ్‌తో కలిసి ఆయన ఆదివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. 11సార్లు కప్ గెలిచిన ఆస్ట్రేలియా జట్టును సెమీస్‌లో ఓడించి ఫైనల్స్‌లోకి వచ్చిన భారత మహిళా క్రికెట్ జట్టు ఆదివారం సౌత్ ఆఫ్రికాతో జరిగే మ్యాచ్‌లోనూ విజయం సాధించాలని ప్రార్థించామన్నారు. విజయ్ మాట్లాడుతూ మన దేశంలో మహిళలు బయటకు వచ్చి క్రీడల్లో రాణించాలంటే చాలా కష్టమన్నారు. అలాంటి క్రికెట్‌లో మహిళా జట్టు అద్భుతంగా రాణించి ఫైనల్స్‌లో అడుగుపెట్టారన్నారు. విజయం చేకూరాలని కోరుకుంటున్నామన్నారు.

డ్రగ్స్‌తో యువత భవిష్యత్తుకు ప్రమాదం





డ్రగ్స్‌పై అవగాహనా పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రవినాయుడు, రవిమనోహరాచారి, దివాకర్‌రెడ్డి తదితరులు- 5-కే రన్‌లో పాల్గొన్న యువత

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 2(ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్‌తో యువత భవిష్యత్తుకు ప్రమాదమని వక్తలు అన్నారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ఐఎంసీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఎస్వీ యూనివర్సిటీ నుంచి ఐదు కిలోమీటర్ల రన్ నిర్వహించారు. తిరుపతి ఏఎస్పీ రవి మనోహరాచారి, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి, శాప్ చైర్మన్ రవినాయుడు, తాతయ్యగుంట గంగమ్మ ఆలయ పాలకమండలి చైర్మన్ నైనారు మహేష్ యాదవ్, పోలీసు అధికారులు పాల్గొని మాట్లాడారు. మాదక ద్రవ్యాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు. అంతకు ముందు మాదక ద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. రన్‌లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

డాలర్ పెత్తనం కష్టమే

సీనియర్ పాత్రికేయుడు ప్రబీర్ పురకాయస్థ



సదస్సులో ప్రసంగిస్తున్న ప్రబీర్ పురకాయస్థ

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధిస్తున్న సుంకాలను సోషలిస్ట్ దేశాలు నిలవరిస్తున్నాయని, ఇకపై డాలర్ పెత్తనాన్ని ట్రంప్ కొనసాగించడం కష్టమని సీనియర్ పాత్రికేయులు ప్రబీర్ పురకాయస్థ అన్నారు. సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభలను పురస్కరించుకుని తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ప్రజాస్వామిక హక్కులపై దాడి అంశంపై సదస్సు నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆర్థిక సమస్యల నుంచి బయటపడటానికి విదేశాలపై అధిక మొత్తంలో సుంకాలు విధిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా మన దేశంపైనా 50శాతం విధించారని చెప్పారు. మన దేశంలో కార్మిక హక్కులపై దాడి పెరిగిందని, ఇది ఆందోళన కలిగించే అంశమని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తున్నాయని విమర్శించారు. ఈ దాడులను కార్మిక సంఘాలు ఐక్యతతో ఎదుర్కోవాలన్నారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 8 గంటల పని విధానాన్ని రద్దు చేసి 13 గంటలుగా నిర్ణయిస్తే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం దానికి ఆమోదం తెలపడం బాధాకరమన్నారు. అసెంబ్లీలో వైసీపీ కూడా దీనిపై ప్రశ్నించలేదన్నారు. పాలక పక్షాలు వైఖరి మార్చుకోకపోతే కార్మిక వర్గాలు తిరుగుబాటు చేసే రోజులు వస్తాయని హెచ్చరించారు. ఈ సదస్సులో సీఐటీయూ నేతలు ఎస్.జయచంద్ర, టి.సుబ్రమణ్యం, జి.బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం అవసరం

● అప్సా స్టార్ అచీవర్స్ అవార్డుల ప్రదానంలో డీఈవో



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఈవో కుమార్

తిరుపతి(విద్య), నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రతిభకు ప్రోత్సాహం అవసరమని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ అన్నారు. ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) ఆధ్వర్యంలో స్టార్ అచీవర్స్ అవార్డుల ప్రదానోత్సవం ఆదివారం జరిగింది. తిరుపతిలోని ఢిల్లీ పబ్లిక్‌స్కూల్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమానికి డీఈవో కేవీఎన్ కుమార్, గేట్, గీతం విద్యాసంస్థల అధినేత వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరై 2025వ సంవత్సరం 10వ తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన 140 మంది విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేశారు. 120 మంది కరస్పాండెంట్లకు కూడా అవార్డులు ఇచ్చారు. డీఈవో మాట్లాడుతూ 10వ తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను, కరస్పాండెంట్లను గుర్తించి అవార్డులు ప్రదానం చేసిన అప్సాను అభినందించారు. అనంతరం అప్సా నాయకులు డీఈవోను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అప్సా రాష్ట్ర నాయకులు సుందరం, మెట్ట జనార్దన్, సుబ్రహ్మణ్యంరాజు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నా : ఎమ్మెల్యే భాను



టీఆర్ కండ్రిగ వద్ద సిమెంట్ రోడ్డును ప్రారంభిస్తున్న భానుప్రకాష్

వడమాలపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏడాదిన్నర కాలంలో వడమాలపేట మండలంలో సుమారు 25 కోట్ల రూపాయలతో సిమెంట్ రోడ్లు నిర్మించినట్లు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తెలిపారు. మండలంలోని తిరుమణ్యం పంచాయతీ టీఆర్ కండ్రిగకు ఎంఆర్‌సీ రాజు ఆధ్వర్యంలో రూ.10 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును, టీఆర్ కండ్రిగలో 8 లక్షల రూపాయలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పుత్తూరు కోసం తన వంతు సాయంగా అభివృద్ధి చేస్తున్న ఎంఆర్‌సీ రాజు కుటుంబం ఆదర్శమన్నారు. అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నాని, ఓర్వలేని వైసీపీ వారు కావాలనే చిచ్చుపెడుతున్నారని విమర్శించారు. ప్రజలు ప్రతిపక్షానికి కూడా అర్హత ఇవ్వకుండా తీర్పు ఇచ్చినా బుద్ధి రాలేదన్నారు. సర్పంచ్ మణిరాజు, నాయకులు ధనంజయులు నాయుడు, దామయాదవ్, సుబ్రమణ్యంరెడ్డి, శివరాయల్, శ్రీధర్ రాజు, జడ్పీటీసీ మురళీధర్ రెడ్డి, కుమార్, దేవా, గురునాథం బాబు, గజేంద్ర, జ్యోతీశ్వర్, పీఆర్ డీఈ చంద్రశేఖర్, ఏఈ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకోవడం లేదు

● మున్సిపల్ చైర్మన్



టెండర్ పత్రాలను చూపుతున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు

పుత్తూరు అర్బన్, నవంబర్ 2(ఆంధ్రజ్యోతి): పుత్తూరు పట్టణ అభివృద్ధిని తాము అడ్డుకోవడం లేదని మున్సిపల్ చైర్మన్ హరి పేర్కొన్నారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ... గత ఏడు కౌన్సిల్ సమావేశాల్లో సభ్యులు ఆమోదించిన రూ.90 లక్షల అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కమిషనర్ మంజునాథ్ గౌడ్ అడ్డుకున్నారని ఆరోపించారు. రూ.2 కోట్ల టీఎఫ్‌సీ, ఎల్ఆర్ఎస్ నిధుల వ్యవహారం పక్కకుండా అడ్డుకుంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి తమ పాలకవర్గానికి మంచి పేరు వస్తుందని ఓర్వలేక అభివృద్ధిని అడ్డుకుంటోందని ఆరోపించారు. ఆమోదించిన టెండర్లను అమలు చేయలేదని వారు పత్రాలను సమావేశంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, కౌన్సిలర్లు ఏకాంబరం, బాలసుబ్రమణ్యం, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అభయ హస్తాధీశుడి సేవలో తెలంగాణ హైకోర్టు జడ్జి



న్యాయమూర్తి నరసింగరావుకు స్వాగతం పలుకుతున్న అధికారులు

వడమాలపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో కొలువైన అభయ హస్తాధీశుడు ప్రసన్న వెంకటేశ్వర స్వామిని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఎన్.నరసింగరావు దర్శించుకున్నారు. ఆదివారం వెంకన్న దర్శనార్థం విచ్చేసిన న్యాయమూర్తికి అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. స్వామివారికి అర్చన చేసి మంగళ హారతులిచ్చారు. అనంతరం ఆలయ చరిత్రను వివరించారు. తీర్థప్రసాదాలు అందజేసి, వేదాశీర్వచనం ఇచ్చారు. ఆలయ అధికారి వేణుగోపాల్ దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గుర్తింపు కార్డులివ్వండి

పుత్తూరు టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తోపుడు బండ్లపై వ్యాపారం చేసేవారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని హాకర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బుజ్జి పేర్కొన్నారు. పట్టణంలో సీఐటీయూ కార్యాలయ ఆవరణలో జరిగిన సమావేశంలో తోపుడు బండ్ల వ్యాపారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, మున్సిపాలిటీ గేటు వసూలు చేయరాదని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నజీర్, ప్రధాన కార్యదర్శిగా నవీన్, కోశాధికారిగా భువనేశ్వరి, ఉపాధ్యక్షులుగా అంకయ్య, అజీత్ సహా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మునిరాజా, శ్రీనివాసులు, విజయ్, నరసింహులు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో క్రమశిక్షణ



స్కౌట్స్ అండ్ గైడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న మాస్టర్లు

పుత్తూరు టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో ఉండే విద్యార్థులకు క్రమశిక్షణ అలవడుతుందని జిల్లా ఇన్‌ఛార్జి కార్యదర్శి విజయ్‌కుమార్, డిస్ట్రిక్ట్ ఆర్గనైజింగ్ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం పట్టణంలో స్కౌట్స్ శిక్షణ కార్యాలయంలో సౌట్స్ అండ్ గైడ్స్ ఫౌండేషన్ డే సదస్సు నిర్వహించారు. ఫ్లాగ్ డేను ప్రతి పాఠశాలలో నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్కౌట్స్ మాస్టర్లు జయప్రకాష్, హరి, అశోక్‌కుమార్, జయకుమార్ పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ



బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ వైసీపీ తలపెట్టిన కోటి సంతకాల సేకరణ ఆ పార్టీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త రాజేష్ ఆధ్వర్యంలో బీఎన్‌కండ్రిగ, కంచనపుత్తూరుల్లో జరిగింది. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ.. ఉన్నత ఆశయంతో జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కాలేజీల నిర్మాణానికి శ్రీకారం చుడితే వాటిని పూర్తి చేయకుండా ప్రైవేటు వారికి కూటమి ప్రభుత్వం అప్పగించడం దారుణమన్నారు. అనంతరం నీర్పాకోట గ్రామంలో విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన షిఫ్ట్ ఆపరేటర్ సాయిబిచ్చయ్య కుటుంబీకులను నాయకులతో కలిసి పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ మణినాయుడు, ప్రసాద్‌పాల్, అజయ్‌కుమార్ రెడ్డి, జయచంద్రనాయుడు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కుంటుపడిన పారిశుధ్యం

కేవీబీపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో పారిశుధ్యం కుంటుపడి వీధుల్లో మురుగు చేరి దుర్గంధం వెదజల్లుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు సిమెంటు రోడ్లు, కాలువలు లేని వీధుల్లో నీరు నిల్వ ఉండిపోయింది. దీంతో దోమలు, ఈగల వృద్ధి చెందాయి. కళత్తూరు, దిగువపుత్తూరు, ఎస్ఎస్ కండ్రిగ, పాతపాళెం, కేసీ కండ్రిగ తదితర గ్రామాల్లో సమస్య తీవ్రంగా ఉంది. ఎక్కడ చూసినా చెత్తకుప్పలతో వీధులు నిండిపోయాయి. పంచాయతీ పారిశుధ్య సిబ్బంది సమస్యపై దృష్టి సారించడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాల్సి ఉంది.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

టిడ్కో గృహ సముదాయం వద్ద కార్డన్ సెర్చ్



వెంకటగిరి టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక టిడ్కో ఇళ్ల వద్ద పోలీసులు ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఏవీ రమణ మాట్లాడుతూ పట్టణంలో అనుమానితులను గుర్తిస్తే పోలీసులకు సమాచారమివ్వాలని సూచించారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్డన్ సెర్చ్‌లో 16మోటార్ సైకిళ్లు, 3ఆటోలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్ఐ ఏడుకొండలు, శివశంకర్, గోపీ, సిబ్బంది పాల్గొన్నారు.

నరకంగా మారిన ప్రయాణం

అధ్వానంగా కొరిడి-పేర్నాడు రోడ్డు



గోతులమయంగా కొరిడి-పేర్నాడు రోడ్డు



కోతకు గురికావడంతో రక్షణగా వేసిన ఇసుకబస్తాలు

సూళ్లూరుపేట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నుంచి కొరిడి-పేర్నాడు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. గుంతలమయంగా ఉన్న ఈ రోడ్డులో ఇటీవల వర్షాలకు నీరు నిలబడి ఇబ్బందికరంగా మారింది. శ్రీహరికోటకు వెళ్లే మార్గంలో అటకానితిప్ప నుంచి కదపత్ర వరకు దాదాపు 9 కిలో మీటర్ల మేర పులికాట్ సరస్సు మధ్యలో కొరిడి-పేర్నాడు వంకు గ్రావెల్ రోడ్డు మార్గం ఉంది. పులికాట్ తీర ప్రాంతాల్లో దాదాపు 3 పంచాయతీలు చేరి 23 గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామ ప్రజలు పనుల నిమిత్తం సూళ్లూరుపేటకు ఈ రోడ్డు గుండా రావాలి. ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీసం తట్టెడు మట్టి కూడా వేసిన పాపాన పోలేదు. దీంతో గ్రావెల్ రోడ్డు కూడా గోతులమయంగా మారింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక తారురోడ్డుగా మార్చేందుకు అసెంబ్లీలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ రెండు సార్లు ప్రస్తావించారు. సీఎం దృష్టికి సైతం తీసుకెళ్లి తారురోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అనుమతులు ఇప్పించాలని డిప్యూటీ సీఎంను విన్నవించారు. కనీసం మరమ్మతులు కూడా చేయలేదు. పులికాట్ నీటి ఉధృతికి రోడ్డు గండ్లుపడింది. కోతకు గురైంది. గ్రామస్తులు గండ్ల వద్ద ఇసుక బస్తాలను రక్షణగా వేసుకున్నారు. బస్సు సైతం అతి కష్టం మీద నడుస్తోంది. గుంతలు పూడ్చి మరమ్మతులైనా చేపట్టాలని కోరుతున్నారు.

తెప్పలపై ఆండాల్ అమ్మవారి దివ్యదర్శనం



తిరుచ్చిపై అమ్మవారి పురవిహారం



నారాయణవనం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కల్యాణ వెంకన్న ఆలయ కార్తీక తెప్పోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం పద్మసరస్సులో తెప్పలపై ఆండాల్(గోదాదేవి) అమ్మవారు విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం సుప్రభాత సేవ, నిత్య కైంకర్యాలు, ద్వాదశి ప్రత్యేక అర్చనలు చేశారు. అనంతరం గంగాళంలోని స్నపన తిరుమంజనం నిర్వహించి, ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం ఆండాల్ అమ్మవారిని తిరుచ్చి వాహనంపై ఆధిష్టింపజేసి మేళ తాళాలు, కోలాటాల మధ్య పద్మసరస్సుకు వేంచేపు చేశారు. అనంతరం విద్యుత్ దీపాలంకరణలో ఉన్న తెప్పలపై అమ్మవారు ఆశీనులై సరస్సులో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. అనంతరం ఆలయానికి చేరుకున్న అమ్మవారికి ఆస్థానం, ఏకాంత సేవను నిర్వహించారు. కార్యక్రమాలను టీటీడీ స్థానిక ఆలయాల సూపరింటెండెంట్ దయ్యం, ఆలయాధికారి నాగరాజు, ఏర్పాట్లను పర్యవేక్షించారు.

స్వచ్ఛ శ్రీకాళహస్తికి కృషి చేద్దాం



కన్నప్ప కొండపై వ్యర్థాలు సేకరిస్తున్న యువతరం సేవా సమితి సభ్యులు

శ్రీకాళహస్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ శ్రీకాళహస్తి-పవిత్ర శ్రీకాళహస్తికి ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని యువతరం సేవా సమితి సభ్యులు అన్నారు. ఆదివారం యువతరం సేవా సమితి, ఈకో సేవియర్స్, స్వచ్ఛ ఫౌండేషన్, భారత్ సేవా ఫౌండేషన్, మన ఊరి మన గుడి సేవా సంస్థలకు చెందిన సుమారు 50 మంది సభ్యులు ప్లాస్టిక్ తదితర వ్యర్థాలను ఏరేశారు. ఆలయంలో భాగంగా కొండపై పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తూ పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సేవలు అందించారు. భక్తకన్నప్ప కొండకు నిత్యం పెద్దసంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడం ప్రధాన సమస్యగా మారింది. సేవాసంస్థల సభ్యులు సమన్వయంతో కొండ భాగం నుంచి కింది వరకు పారిశుధ్య కార్యక్రమం చేపట్టారు. అదే విధంగా సమీపంలోని దుకాణాల యజమానులు, భక్తులకు ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణ బాధ్యత గురించి వివరించారు. ఈ సందర్భంగా సేవా సంస్థల ప్రతినిధులు మాట్లాడుతూ కొండపై పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణాన్ని దెబ్బతీస్తున్నాయన్నారు. భవిష్యత్తులో శ్రీకాళహస్తిని ప్లాస్టిక్ రహిత క్షేత్రంగా మారుద్దామని పిలుపునిచ్చారు. తమకు అనుమతి ఇచ్చిన ముక్కంటి ఆలయ ఈవో బాపిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



ఆలయం వద్ద టాక్సెస్ సెంట్రల్‌బోర్డు ఆఫ్ డైరెక్టర్ రాజశేఖర్

శ్రీకాళహస్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. టాక్సెస్ సెంట్రల్ బోర్డు ఆఫ్ డైరెక్టర్ రాజశేఖర్, మహారాష్ట్ర మంత్రి గిరీష్ మహాజన్ స్వామిఅమ్మవార్లను దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఆలయ అధికారులు వారికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

సత్యసాయి మందిర సేవలు ప్రశంసనీయం



శ్రీకాళహస్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్యసాయిమందిర నిర్వాహకుల సేవలు ప్రశంసనీయమని టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ అన్నారు. ఆదివారం ఆయన మందిరంలో భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పురపాలకసంఘ పారిశుధ్య సిబ్బందికి దీరలు, పంచెలను పంపిణీ చేశారు. టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, సత్యసాయి మందిర నిర్వాహకులు పాల్గొన్నారు.

యువశ్రీ మురళికి తెలుగు సాహితీ పురస్కారం



యువశ్రీ మురళికి సన్మానిస్తున్న నిర్వాహకులు

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలుగు ఉపాధ్యాయుడు, కవి, రచయిత, బాపోద్యమ నాయకుడు యువశ్రీ మురళి తెలుగు భాష సేవలకు గుర్తింపుగా తెలుగు సాహితీ పురస్కారం అందుకున్నారు. ఆదివారం చిత్తూరు జిల్లా పలమనేరు పట్టణంలోని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో కళా మందిరంలో జరిగిన 13వ వార్షికోత్సవంలో తెలుగు బాషాభివృద్ధికి కృషి చేసిన పలువురు సాహితీ ప్రముఖులకు తెలుగు తల్లి జ్ఞాపిక, ప్రశంసా పత్రం, శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు తులసి నాదంనాయుడు, నవ్వుల ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు, శతావధాని ఆముదాల మురళి పాల్గొన్నారు.

వాకిచర్ల గుర్రప్పశెట్టికి సన్మానం



శ్రీకాళహస్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తొండవాడలోని నారాయణగార్డెన్స్‌లో ఆదివారం తిరుపతి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి సభ్యుడు వాకిచర్ల గుర్రప్పశెట్టిని ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో నరసింహులు, సురేష్ పాల్గొన్నారు.

గుండె పోటుతో మాజీ సర్పంచ్ మృతి

చిట్టమూరు, నవంబర్ 2(ఆంధ్రజ్యోతి) : తాడిమేడు పంచాయతీ మాజీ సర్పంచ్, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పల్లం వెంకటరత్నం(59) శనివారం అర్ధరాత్రి గుండె పోటుతో మృతి చెందారు. ఛాతిలో నొప్పిగా ఉందని చెప్పడంతో కుటుంబ సభ్యులు తిరుపతి తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రాణం విడిచారు. వెంకటరత్నంకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. టీడీపీ నాయకులు నివాళులర్పించారు.

టెట్ నుంచి ఇన్‌సర్వీస్ టీచర్లను మినహాయించండి



సమావేశంలో మాట్లాడుతున్న మురళీకృష్ణ

శ్రీకాళహస్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): టెట్ నుంచి ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ కోరారు. ఆదివారం సంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి 30శాతం మధ్యంతర భృతి ఇవ్వాలన్నారు. పీఆర్సీ, డీఏ బకాయిలు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ యాప్‌ల భారం తగ్గించి బోధనకే పరిమితం చేయాలన్నారు. వెంకటాద్రి, వెంకటయ్య, జాన హరి, భువనేశ్వరి, మునస్వామి, చెంచురాజా తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



శ్రీకాళహస్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంపేడు పంచాయతీ పరిధిలోని ఈశ్వరయ్య కాలనీలో పేదలకు ఆదివారం సంఘ సేవకుడు కోటేశ్వరబాబు దుప్పట్లు పంపిణీ చేశారు. చిన్నారులకు బిస్కెట్ ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకున్న దాంట్లో కొంత సేవా కార్యక్రమాలకు వినియోగిస్తున్నట్లు తెలిపారు. మస్తాన్, శంకరయ్య, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మోటార్లు చోరీ చేసిన వారిని అరెస్ట్ చేయాలి

సత్యవేడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మదనంబేడులో ఇటీవల తెలుగు గంగ కాలువపై ఉన్న రైతుల మోటార్లను చోరీ చేసిన వారిని అరెస్ట్ చేసి రైతులకు న్యాయం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్దన్, సీపీఎం మండల కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. గ్రామంలో మోటార్లు పోగొట్టుకున్న రైతులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 20 మోటార్లను పైగా గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుని వెళ్లారని తెలిపారు. దీనిపై పోలీసులు ఇంతవరకు పట్టించుకోలేదన్నారు. పాండి, వెంకటేష్, కుమారి, ఉష, ఎల్లయ్య, అమ్ములమ్మ, కామాక్షి, మునెమ్మ, సోమయ్య, వసంతమ్మ, రామయ్య, రాజు, సెంథిల్ తదితరులు పాల్గొన్నారు.

అల్లిమిట్టలో కార్డన్ సెర్చ్



రేణిగుంట, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లిమిట్టలో రేణిగుంట అర్బన్ పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఆదివారం ఉదయం వెంకటాపురం పంచాయతీలోని అల్లిమిట్టలోని ప్రతి ఇంట్లో సోదాలు నిర్వహించారు. ద్విచక్ర వాహనాలకు రికార్డులను పరిశీలించారు. రికార్డులు లేని 18 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ జయచంద్ర మాట్లాడుతూ... అనుమానిత వ్యక్తుల సంచారంపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

నారావారిపల్లెకు రోహిత్ దంపతులు



రామ్మూర్తినాయుడి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న రోహిత్ దంపతులు

చంద్రగిరి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): దివంగత నారా రామ్మూర్తినాయుడి కుమారుడు రోహిత్, శిరీష దంపతులు స్వగ్రామమైన చంద్రగిరి మండలం నారావారిపల్లెకు ఆదివారం విచ్చేశారు. తల్లి ఇందిరతో పాటు గ్రామస్తులు, బంధువులతో కలిసి రోహిత్, ఆయన సతీమణి శిరీష నాగాలమ్మ, గ్రామదేవత దొడ్డి గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామ్మూర్తినాయుడు, తాత, అవ్వలు ఖర్జూరనాయుడు, అమ్మణ్ణమ్మ సమాధులకు.. అనంతరం గ్రామంలోని ఎన్టీఆర్, బసవతారకం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆతకుముందు శాప్ చైర్మన్ రవినాయుడు ఆధ్వర్యంలో రోహిత్ దంపతులకు స్వాగతం పలికారు. తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్ మహేష్‌యాదవ్ వీరికి శాలువా కప్పి జ్ఞాపిక మొమెంటో అందజేశారు.

మంచి పౌరుల కొరత తీర్చడమే బాలోత్సవం లక్ష్యం





అలరించిన చిన్నారుల కోలాటం- విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అతిథులు

తిరుపతి(కల్చరల్), నవంబరు 1(ఆంధ్రజ్యోతి): 'మన దేశంలో మంచి పౌరుల కొరత వెంటాడుతోంది. దీనిని తీర్చడానికి బాలోత్సవం ఎంతగానో ఉపకరిస్తుంది' అని పలువురు అభిప్రాయపడ్డారు. తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాలలో రెండు రోజులపాటు జరిగిన బాలోత్సవం ఆదివారం ముగిసింది. ఈ సమావేశంలో ప్రముఖ సాహితీవేత్త సాకం నాగరాజు, గార్లపాటి దామోదరం, బీఎస్ రెడ్డి, మణికంఠ, మబ్బు సూర్యనారాయణరెడ్డి, కేవీరావు, ఏనుగుల అంకమనాయుడు, అనంతశయనం, హేమచంద్ర తదితరులు ప్రసంగించారు. ఈ సారి బాలోత్సవంలో 11వేల మందికిపైగా బాలబాలికలు పాల్గొన్నారన్నారు. వివిధ అంశాల్లో జరిగిన పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారని చెప్పారు. నిత్యం చదువుల ఒత్తిడిలో ఉండే పిల్లలకు ఈ బాలోత్సవం ఆటవిడుపుగా పేర్కొన్నారు. తమ ప్రతిభతో తొలిమూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బెంకయ్య దామోదరం, నడ్డి నారాయణ, రెడ్డెప్ప, గురునాధం, మునిలక్ష్మి, మన్నవ గంగాధర ప్రసాద్, నెమిలేటి కిట్టన్న, ప్రసాద్, యువశ్రీ మురళి, పేరూరు బాలసుబ్రమణ్యం, గోవిందయ్య, పోతుహరి తదితరులు పాల్గొన్నారు.



బొమ్మలు గీస్తున్న చిన్నారులు









ఆకట్టుకున్న చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు

గంగ కాలువలో మృతదేహం లభ్యం

వరదయ్యపాళెం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగనందాపురం సమీపంలోని తెలుగుగంగ కాలువలో మృతదేహం తేలుతున్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీసి సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతదేహం డక్కిలి మండలం వెలికల్లుకు చెందిన మణికండన్ (35) గుర్తించారు.

కాశీబుగ్గ ఘటన బాధాకరం

శ్రీకాళహస్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పలాసలోని కాశీబుగ్గ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం సమయంలో రద్దీ కారణంగా భక్తులు మరణించడం బాధాకరమని శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు ఆదివారం విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఎంపీజే జిల్లా కార్యవర్గం



నియామకపత్రం అందుకుంటున్న కార్యవర్గ సభ్యులు

శ్రీకాళహస్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బహదూరుపేట మస్జీదే మహమ్మదీయలో మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ సభ్యుల సమావేశం జరిగింది. ఎంపీజే రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రజాక్ ఆదేశాల మేరకు రాయలసీమ ఇన్‌ఛార్జి ఆయూబ్‌ఖాన్ ఆధ్వర్యంలో తిరుపతి జిలా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్ అమీర్ బాషా, ప్రధానకార్యదర్శిగా అబ్దుల్ కలాంను ఎన్నుకున్నారు. అన్యాయం, ప్రజా సమస్యలపై అహర్నిశలు పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఉమ్రి తదితరులు పాల్గొన్నారు.

జోగి రమేష్ అరెస్టుపై టీడీపీ హర్షం

శ్రీకాళహస్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్టుతో నకిలీ మద్యం కారణంగా మృతి చెందిన వారి కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నాని టీడీపీ బీసీ విభాగ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్ రావు అన్నారు. ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో నకిలీ మద్యం తయారు చేయించి విక్రయించి కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకుని వేలాదిమంది పేద ప్రజల ప్రాణాలు పోవడానికి కారణమైన జోగి రమేష్‌ను అరెస్టు చేయడం సంతోషకరమన్నారు. నకిలీ మద్యం కేసులో అడ్డంగా దొరికి ప్రమాణాలు చేస్తే చట్టాల నుంచి తప్పించుకోలేరన్నారు. వేరేవారి పేరు మీద గదిని అద్దెకు తీసుకుని కావాల్సిన యంత్రాలు కొనుగులుచేసి నకిలీ లిక్కర్ తయారు చేయాలని... దానిని కూటమి ప్రభుత్వంపై రుద్దుతామని జోగి రమేష్ తనతో అన్నాడని జనార్ధన రావు చెప్పడం వైసీపీ కుట్రలను బహిర్గతం చేస్తోందన్నారు. జోగి రమేష్ ద్రోహబుద్ధిని జనార్దన రావు తేటతెల్లడం చేశాడన్నారు. చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరన్నారు. ఈ కార్యక్రమంలో వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, నాయకులు బి.భాస్కర్ ముదిరాజ్, వజ్రం కిషోర్, డీవీ నారాయణ, కోట చంద్రశేఖర్, మణి, సులేమాన్ తదితరులు పాల్గొన్నారు.

భక్త జన సంద్రం... వాయులింగేశ్వరుడి ఆలయం

శ్రీకాళహస్తి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సెలవులకుతోడు కార్తీకమాసం కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 30 వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 570 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 2,492, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,809మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,653మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1.007, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 307, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 226మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 88మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 22,712 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఆగమోక్తంగా ఆకాశదీపం

జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం ఆకాశదీపం ఆగమోక్తంగా వెలిగించారు. ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రతి రోజు ఆకాశ దీపాన్ని సంప్రదాయబద్ధంగా వెలిగిస్తుంటారు. ఇందులో భాగంగా ఆలయ అధికారులు ఊంజల్‌మండపం వద్ద కార్తీక దీపానికి పూజలుచేశారు. అనంతరం స్థూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు విశేషంగా ఆకాశదీపాన్ని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



రాహుకేతు పూజల కోసం వేచి ఉన్న భక్తులు

ప్రొటోకాల్ ఉల్లంఘనపై ఆదిమూలం అసహనం

సత్యవేడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పోలీసులు ప్రొటోకాల్ ఉల్లంఘిస్తున్నారని ఎమ్మెల్యే ఆదిమూలం అసహనం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం సోషల్ మీడియా వేదికగా పోలీసుల తీరుపై విరుచుకుపడ్డారు. తాను నియోజకవర్గ ఎమ్మెల్యేగా మండలాల్లో పర్యటిస్తుంటే తన వెంట కనీసం ఒక ఎస్ఐ కూడా రావడం లేదని, జీపు రిపేర్ అంటూ కుంటిసాకులు చెబుతున్నారని మండిపడ్డారు. నియోజకవర్గంలో ఎలాంటి ప్రొటోకాల్ లేని వ్యక్తులకు ఎస్కార్టులుగా జీపులతో ప్రొటోకాల్ డ్యూటీ వేయడం ఏమిటని ఎమ్మెల్యే ప్రశ్నించారు. పోలీసుల తీరు ఇలాగే కొనసాగితే తనకు ఎలాంటి పోలీసు ప్రొటోకాల్ అవసరం లేదన్నారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీకి, పుత్తూరు డీఎస్పీకి ఇదివరకే ఫిర్యాదు కూడా చేసినట్లు ఆయన వివరించారు.

భారీ స్క్రీన్‌పై మహిళల వన్డే ప్రపంచ కప్ ఫైనల్

సత్యవేడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నవీ ముంబై డీవై పాటిల్ స్టేడియంలో ఆదివారం భారత్ - దక్షిణాఫ్రికా మధ్య జరిగిన మహిళల వన్డే ప్రపంచకప్ ఫైనల్‌ను సత్యవేడు ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శంకర్‌రెడ్డి చొరవతో భారీ ఎల్‌ఈడీ స్క్రీన్‌పై క్రికెట్ అభిమానులు, మహిళలు వీక్షించారు. కోట్లాది భారత ప్రజల ఆశలను మోస్తూ ప్రపంచకప్ ఫైనల్‌కు చేరిన భారత మహిళా జట్టు ఆటను తిలకించాలన్న స్థానికుల అభీష్టం మేరకు శంకర్‌రెడ్డి స్క్రీన్‌ను ఏర్పాటు చేయించారు. అంతకు మునుపు ఫైనల్‌లో హర్మన్ సేన విజయం సాధించాలని స్థానిక బాల నాగాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జడ్పీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, శివకుమార్,మునస్వామి యాదవ్, రూబెన్ తదితరులు పాల్గొన్నారు.



మ్యాచ్ వీక్షిస్తున్న టీడీపీ నాయకులు

వరల్డ్ కప్ గెలవాలని....

శ్రీకాళహస్తి (ఆంధ్రజ్యోతి): మహిళా క్రికెట్ వరల్డ్ కప్‌ను భారత్ గెలవాలని టీడీపీ నాయకులు పూజలు చేశారు. పట్టణంలోని శీతాలాంబ ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం వారు మాట్లాడుతూ మహిళా క్రికెట్ జట్టు అమోఘమైన ప్రదర్శనతో దూసుకుపోతోందన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, ముక్కంటి ఆలయ పాలకమండలి సభ్యుడు గుర్రప్పశెట్టి, కంఠారమేష్, కాసరం రమేష్, షాకీరాలీ, అస్మత్, ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు.

